క్లుప్తంగా

ఆర్థికసాయం



వాజేడు: పేద కుటుంబానికి చెందిన మహిళ మృతి చెందడంతో ఆమె కుటుంబానికి దహన సంస్కారాల నిమిత్తం చింతూరు సర్పంచ్ తెల్లం బుల్లేశ్వరావు ఆర్థికసాయాన్ని ఆదివారం అందించారు. చింతూరుకు చెందిన పూజారి సమ్మక్క అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. సమ్మక్క కుటుంబ వారు పేద వారు కావడంతో సర్పంచ్ బుల్లేశ్వరావు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పరామర్శించి రూ.3500 ఆర్థిక సాయం కుటుంబ సభ్యులకు అందించారు.

ప్రతిఫలంతో తిరుగు ప్రయాణం



వెంకటాపురం(కె): మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు సాగుచేసిన మిర్చికోతలకు రెండు నెలల క్రితం ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన వలస కూ లీలు కష్టానికి తగిన ప్రతిఫలంతో ఆదివారం ప్రైవేటు వాహనాల్లో తిరుగు పయనమయ్యా రు. స్వగ్రామాలకు వెళ్లే క్రమంలో వెంట తీసుకొచ్చిన సామాన్లను వాహనంలో సర్దుబాటు చేస్తూ కనిపించారు. కూర్చోడానికి స్థలం లేక నిలబడి ప్రయాణం చేయడానికి సిద్ధమైన వీరిని చూస్తే బతికేందుకు డబ్బుకు ఎంత ప్రాధాన్యత ఉందో అర్థమవుతుంది. వారి ఓపిక వెనుక ఉన్న చెమట కష్టం విలువ ఏంటో తెలుస్తుంది.

ఇద్దరిపై కేసు నమోదు

మహాముత్తారం: భూ సమస్యపై ఒకరిపై దాడి చేసిన సంఘటనలో ఇద్దరిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని స్తంభంపల్లి(పీకే) గ్రామానికి చెందిన కోట పున్నంను సింగారం గ్రామానికి చెందిన బొబ్బిలి రాజు, వెంకటమ్మ సింగారం గ్రామం వద్ద ఆదివారం భూ సమస్యపై గొడవపడి పున్నంపై దాడి చేసి గాయపర్చడంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

పలిమెల : దళితుల మనోభావాలు దెబ్బతినే విధంగా వారిని కించపరుస్తూ ఓ పత్రికలో వచ్చిన కథనానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బాడిష్ సారయ్య డిమాండ్ చేశారు. దళితుల మనోభావాలు కించపర్చేలా ఉన్నాయని దానికి కారకులైన వారి పై చర్యలు తీసుకోవాలని ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితులను శిక్షించకుంటే దళితులంతా ఉద్యమానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

ముదిరాజ్ యూత్ కమిటీ ఎన్నిక



మొగుళ్లపల్లి: మండల కేంద్రంలో ఆదివారం ముదిరాజ్ సొసైటీ సంఘం, ముదిరాజ్ పెద్దమ్మ తల్లి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో యూత్ కమిటీని ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా వనం రమేష్, ఉపాధ్యక్షులుగా చెక్క రాకేష్, కార్యదర్శిగా చిలువేరు పున్నం చందర్, కార్యవర్గ సభ్యులుగా దండు కుమారస్వామి దేవునూరి అజయ్, వనం రంజిత్, వనం రాజశేఖర్, చెక్క శ్రీనివాస్, చెక్క శ్రీకాంత్, సహకార కార్యవర్గ సభ్యులుగా అన్నారం శ్రీకాంత్, బీర్తి రాజు, చెక్క రాము, చెక్క ప్రశాంత్, రావిశెట్టి లింగయ్య, నీరటి రాజేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కందుల సమ్మయ్య, పుట్ట మహేందర్, కందుల చంద్రయ్య, రావిశెట్టి రమేష్, దేవునూరి సాంబయ్య, చెక్క సాంబయ్య, తదితరుల పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో పూజించాలి



భూపాలపల్లి రూరల్: హనుమాన్ (భక్తులు) స్వాములు భక్తి శ్రద్ధలతో పూజలు చేసుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం మండలంలోని గోర్లవీడులో హనుమాన్ దీక్ష పరులకు బిక్ష(ఆహారం) వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీక్షలు చేయడంతో భక్తితో పాటు, సమాజంపై గౌరవం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ నాయకులు, పాల్గొన్నారు.

నిండా ముంచిన మొక్కజొన్న

- ఎకరానికి 4 టన్నులు వస్తుందని నమ్మించారు
- దిగుబడి కేవలం 2 క్వింటాల నుంచి టన్ను వరకు
- లబోదిబోమంటున్న రైతులు



మొక్క జొన్న పంట

వాజేడు: పేరున్న ఓ కంపెనీ పేరు చెప్పి నమ్మించి మొక్కజొన్న పంటను రైతులతో సాగు చేయించారు. దిగుబడి ఎకరానికి నాలుగు టన్నులు వస్తుందని చెప్పారు. సభలు, సమావేశాల ద్వారా రైతులకు అవగాహన సదస్సులను నిర్వహించారు. టన్నుకు రూ.29 వేలు కాగా ఎకరానికి నాలుగు టన్నులకు రూ. 1,16, 000 వస్తుందని నమ్మించారు. విత్తనాలకు పెట్టుబడి మేమే ఇస్తామని తెలుపడంతో రైతులు సాగు చేశారు. తీరా చూస్తే పంట చేతికొచ్చేసరికి ఎకరానికి 2 క్వింటాల నుంచి టన్ను వరకు మాత్రమే వచ్చింది. దీంతో రైతులు అప్పుల పాలయ్యారు.

ఎకరాకు 4 టన్నులు వస్తుందన్నారు..

ఎకరానికి 4 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఓ కంపెనీ ద్వారా వచ్చిన విత్తనాలను సాగు చేయాలని రైతులకు తెలిపారు. ఖర్చు తక్కువ ఆదాయం ఎక్కువగా ఉంటుందని వరి పంటలను ఆపి మరీ మొక్కజొన్నను సాగు చేశారు. ఎకరానికి సుమారుగా కౌలుతో కలిపి రూ.60 వేల వరకు నష్టం వాటిల్లింది.

దిగుబడి 2 క్వింటాల నుంచి టన్ను వరకు

ఎకరానికి నాలుగు టన్నులు వస్తుందని ఆశించి సాగు చేసిన రైతులకు కొందరికి ఎకరానికి 2 క్వింటాల దిగుబడి రాగా మరి కొందరికి ఒక టన్ను వరకు దిగుబడి వచ్చింది. దుక్కులు, మందులు, కూళ్లు అన్ని చూసుకోగా ఎకరానికి రూ.60 వేల వరకు పెట్టుబడి ఖర్చయింది.

లబోదిబోమంటున్న రైతులు

మొక్కజొన్న పంట ద్వారా లాభాలు రాకపోగా అప్పులే మిగిలాయి. పంటకోసం చేసిన అప్పులను ఎలా కట్టాలో తెలియక రైతులు లబోదిబోమంటున్నారు. ఒక పక్క కౌలు కోసం చెలక ఇచ్చిన రైతులు పీక్కుతింటుండగా మరో పక్క సాగుకోసం చేసిన అప్పుల వారి నుంచి ఒత్తిడి పెరిగింది. అప్పుల బారి నుంచి ఎలా బయట పడాలో తెలియని అయోమయ పరిస్థితుల్లో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

పరిహారం ఇవ్వాలి

మొక్కజొన్న పంటను సాగు చేసి తీవ్రంగా నష్టపోయామని తమకు నష్ట పరిహారం కంపెనీ నుంచి ఇప్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. వెంకటాపురం గ్రామానికి చెందిన ఆర్గనైజర్ తమకు అవగాహన కల్పించి ఎకరానికి 4 టన్నుల దిగుబడి వస్తుందని నమ్మించడంతో తాము మొక్క జొన్న సాగు చేశామని తీరా దిగుబడి లేక పోవడంతో తీవ్రంగా నష్ట పోయామని రైతులు వాపోతున్నారు.

తీవ్రంగా నష్టపోయా..



మొక్కజొన్న పంటసాగు చేసి తీవ్రంగా నష్టపోయాను. లాభాలు వస్తాయని నమ్మించడంతో పంటను సాగు చేశా. పంట కోసం చేసిన అప్పులు ఎలా కట్టాలో అర్థం కావడం లేదు. – పాయం జానకి రమణ, రైతు

మూడు టన్నులు రాలేదు



మూడు ఎకరాల మొక్కజొన్న పంటను సాగు చేశాను. పంట ఏపుగా వచ్చింది. కంపెనీ వారు సూచించిన ప్రకారం సాగు చేశాము. తీరా పంట దిగుబడి మూడు ఎకరాల్లో మూడు టన్నులు కూడా రాలేదు. – శేషగిరిరావు, రైతు

వీరయ్యపై కఠిన చర్యలు తీసుకోవాలి

మంగపేట : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను దూషించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గొప్ప వీరయ్యపై కఠిన చర్యలు తీసుకోవాలని జ్వాలా యూత్ అధ్యక్షుడు కోడెల నరేష్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా హక్కులు, చట్టాలను ఉపయోగించుకుని ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తిని పొందిన వీరయ్య విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సింది పోయి అంబేడ్కర్‌ను దూషించడం, కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసినందుకు కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. అతనిపై అధికారులు తగిన చర్యలు తీసుకో వాలని, గిరిజనేతరులకు ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని యూత్ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు.

‘ఆరోపణలు మానుకోవాలి’

మంగపేట : మన్యసీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు గొప్పవీరయ్యపై అసత్యపు ఆరోపణలు మానుకోవాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా కార్యదర్శి మలకం సమ్మయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని చుంచుపల్లిలో ఆ సంఘం అత్యవసర సమావేశం ఆదివారం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. మండల కేంద్రంలోని గంపోనిగూడెంలో ప్రధాన రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని బుచ్చంపేటకు చెందిన పగిడిపల్లి వెంకటేశ్వర్లు ఆ స్థలాన్ని కబ్జా చేసి అక్రమంగా ఇంటిని నిర్మించుకున్నాడని ఆయన ఆరోపించారు. ఆ భూమి విషయంలో తన వ్యక్తి గత స్వార్థం కోసం ఇతరులను ఎగేసి వీరయ్యపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని పేర్కొన్నారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి అతనిని ఆస్థలం నుంచి ఖాళీ చేయించాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులను ప్రలోభాలకు గురిచేసి రాత్రికి రాత్రి భూమిని కబ్జా చేశాడని ఓ కబ్జాకోరు ఆదివాసీల శ్రేయస్సు కోసం బడుగు బలహీన వర్గాల కోసం పనిచేస్తున్న నాయకుడిపై ఆరోపణలు తగదని హితువు పలికారు. వీరయ్యకు వెంకటేశ్వర్లు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. సమావేశంలో ఆసంఘం జిల్లా నాయకులు ఎట్టి రాజబాబు, ఊకె జగ్గారావు, కావుల సమ్మయ్య, వట్టం సురేష్, కబ్బాక రామన్న, తదితరులు పాల్గొనట్లు పేర్కొన్నారు.

ధన్వాడలో లక్ష్మీదేవర బోనాల జాతర

కాటారం: మండలంలోని ధన్వాడలో ఆదివాం లక్ష్మీదేవర బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులంతా కలిసి లక్ష్మీదేవరకు బోనమెత్తి మొక్కులు సమర్పించారు. శివసత్తులు డప్పు చప్పుళ్ల మధ్య పూనకాలతో ఊగిపోయారు. పంటలు సమృద్ధిగా పండి ఇంటిల్లిపాది సుఖసంతోషాలతో ఉండాలని ప్రజలు అమ్మవారిని వేడుకున్నారు. మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, శ్రీపాద ట్రస్టు చైర్మన్ శ్రీనుబాబు ఆదేశాల మేరకు ధన్వాడ ఎంపీటీసీ బోడ మమత నరేశ్, కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.



అన్నదానం చేస్తున్న ఎంపీటీసీ, కాంగ్రెస్ నాయకులు

జిల్లా కేంద్రంలో ఇంటింటికీ సీపీఐ

భూపాలపల్లి అర్బన్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో తెలుసుకునేందుకు ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఇంటింటికీ సీపీఐ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమైనట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. మునిసిపాలిటీ పరిధిలోని 30 వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌కుమార్, సతీష్, సుగుణ, శ్రీనివాస్, రాంచందర్, పోశం, చంద్రమౌళి, శ్రీను, బీమయ్యలు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

నేరాల నియంత్రణకే సీసీ కెమెరాలు



చిట్యాల : సీసీ కెమెరాల ఆపరేట్ రూంను ప్రారంభిస్తున్న సీఐ



టేకుమట్ల : సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

చిట్యాల: సమాజంలో జరుగుతున్న నేరాలను నియంత్రించడంలో సీసీ కెమెరాలది కీలకపాత్ర ఉందని సీఐ వేణుచందర్ అన్నారు. ఆదివారం మండలంలోని అందుకుతండా గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను స్థానిక ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ సిద్ధంకి భాస్కర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సరిగా సిగ్నల్ లేని గ్రామంలో రూ.2.50 లక్షలతో 12 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, పాలకవర్గాన్ని అభినందించారు. గ్రామస్తులు కూడా సీసీ కెమెరాలను దృష్టిలో ఉంచుకొని మలుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భూక్య సుజాత, రాజునాయక్ , ఉపసర్పంచ్ హట్కర్ రజిత, గ్రామపంచాయతీ పాలకవర్గం, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో సీసీ కెమెరాలు ప్రారంభం

టేకుమట(రేగొండ): రేగొండ మండలంలోని తిరుమలగిరిలో మేము సైతంలో భాగంగా గ్రామస్తుల సహకారంతో ఆదివారం సీసీ కెమెరాలను సర్పంచ్ కట్ల రాణీమధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. అలాగే కొత్తపల్లి(బి)లో సీసీ కెమెరాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాలతో గ్రామస్తులు ధైర్యంగా ఉండవచ్చని, ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్నారు. గ్రామాల్లోని కూడలీలలో, రద్దీ ప్రాంతంలో, గ్రామ ప్రారంభం, చివరలో ఏర్పాటు చేసుకోవడంతో అనుమానిత వ్యక్తులను గుర్తించవచ్చన్నారు. త్వరలోనే మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీలో అందరి సహకారంతో పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, నేర రహిత మండలంగా మార్చుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ, వ్యాపారులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మహాముత్తారం(మల్హర్): మల్హర్ మండలంలోని నాచారం గ్రామానికి చెందిన కుమ్మరి రజిత ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను ఆదివారం పెద్దపల్లి జిల్లా జెడ్పీచైర్మన్, మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్ట మధు పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అయన వెంట బీఆర్ఎస్ యువ నాయకుడు జక్కు రాకేష్, పీఏసీఎస్ చైర్మన్ మల్క ప్రకాష్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాఘవరెడ్డి, నాయకులు రవిగౌడ్, యాదగిరిరావు, సర్పంచ్ రామయ్య, ఎడ్ల సుధాకర్ తదితరులు ఉన్నారు. అలాగే మండలంలోని ఇప్పలపల్లికి చెందిన దండ్రు గట్టక్క వారం క్రితం మరణించగా ఆదివారం కాటారం పీఏసీఎస్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చల్ల నారాయణరెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అయన వెంట యాదవ సంఘం అధ్యక్షుడు బొంతల రాజు, నాయకులు నరేష్, ఐలయ్య, చిన్న మల్లు, కొమురయ్య, సమ్మయ్య ఉన్నారు.

కాటారం: మండల కేంద్రంలోని గారెపల్లిలో ఇటీవల మృతి చెందిన కుమ్మరి ఎర్రయ్య కుటుంబాన్ని ఆదివారం పెద్దపల్లి జెడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్ట మధు, బీఆర్ఎస్ యూత్ జిల్లా నాయకుడు జక్కు రాకేశ్ పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ఎర్రయ్య మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మహాముత్తారం: మండలంలోని సింగంపల్లికి చెందిన కురుసం వెంకటయ్య.. కరీంనగర్ ట్రైబల్ వెల్ఫేర్‌లో ఫోర్త్ క్లాస్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఈనెల 6న గుండెపోటుతో మృతి చెందాడు. ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మన్నె చంద్రయ్యతోపాటు పలువురు ఉపాధ్యాయులు పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో భూపాలపల్లి, ములుగు జిల్లాల ప్రధాన కార్యదర్శులు పసుల శంకర్, తాడిచర్ల రవి, ఉపాధ్యాయుడు రవీందర్‌నాయక్ తదితరులు ఉన్నారు. మండలంలోని పోలారం గ్రామానికి చెందిన అంబాల రాజబాపు ఇంటి నిర్మాణం చేపడుతున్న క్రమంలో చేతికి తీవ్రగాయాలయ్యాయి. అతనిని ఆదివారం స్థానిక మాజీ జెడ్పీటీసీ మండల రాజిరెడ్డి పరామర్శించి ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పోలారం వార్డుసభ్యురాలు పంగ మమత అనారోగ్యం బారినపడటంతో ఆమెను పరామర్శించారు.



మృతురాలి కుటుంబాన్ని, పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



జార్జిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తస్లీమా మహ్మద్



ఒకే వేదికపై ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

ములుగు: విద్యార్థి దశలో గడిపిన పాత జ్ఞాపకాలు మధుర స్మృతులని ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్, డాక్టర్ పోరిక రవీందర్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని పద్మశాలీ భవన్‌లో పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా పూర్వ విద్యార్థులు ముంజాల భిక్షపతిగౌడ్, గుండెబోయిన శ్రీహరిగౌడ్ ఆధ్వర్యంలో జార్జిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ జ్ఞాపకాలను తోటి విద్యార్థులతో పంచుకున్నారు. అమరవీరులకు పలికిన జోహార్లతో పద్మశాలీ భవన్ మార్మోగింది. కార్యక్రమంలో జంపాల విద్యాసాగర్, వీరన్న, పిన్నింటి మధు, గూడూరు మహిపాల్, ఓదేలు, శ్రీనివాస్‌గౌడ్, రవిగౌడ్, శంకర్, అశోక్, దేవదాస్, జీవన్‌గౌడ్ పాల్గొన్నారు.

వివేకవర్ధిని పాఠశాలలో..

జిల్లాకేంద్రంలోని వివేకవర్ధిని ఉన్నత పాఠశాలకు చెందిన 1997–98 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పోచంపల్లి రాజ్‌కుమార్, గండ్రకోట విష్ణుకుమార్, గోపు రాజేందర్, వక్కల రాజేందర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

‘ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి’

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పలుగుల పంచాయతీలోని కుంట్లం ఇసుక క్వారీలో లారీ ఇసుక లోడింగ్ చేసి అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు భూపాలపల్లికి చెందిన లారీ ఓనర్ వెన్నపురెడ్డి మహేష్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఇసుక డీడీ ఆన్‌లైన్‌లో తీసుకొని క్వారీకి పంపగా అక్కడ ఉన్న టీఎస్ ఎండీసీ ఉద్యోగులు లోడింగ్ చార్జి రూ. 2500 ఇవ్వాలని అదనంగా వసూలు చేస్తున్నట్లు తెలి పారు. ఈ విషయమై టీఎస్ఎండీసీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

భూపాలపల్లి రూరల్: మండలంలోని మోరంచపల్లి క్రాస్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం గణపురం మండలం దుబ్బపల్లికి చెందిన సింగరేణి కార్మికుడు భిక్షపతి(50) ద్విచక్ర వాహనంపై పరకాలవైపు వెళ్తుండగా వెనుక నుంచి బూడిద లారీ ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో భిక్షపతికి తీవ్ర గాయాలైనట్లు తెలిపారు.

ఔదార్యాన్ని చాటుకున్న చిట్యాల సీఐ

అటుగా వెళ్తున్న చిట్యాల సీఐ వేణుచందర్ క్షతగాత్రున్ని తన వాహనంలో భూపాలపల్లి సింగరేణి ఏరియా హాస్పిటల్‌కు తరలించి తన ఔదార్యాన్ని చాటుకున్నాడు. లారీని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యా ప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు సమావేశం

చిట్యాల: మండల కేంద్రంలోని రైతు వేదికలో చిట్యాల, టేకుమట్ల, మొగుళ్ళపల్లి మండలాలకు చెందిన ఐసీడీఎస్ టీచర్లకు ప్రాజెక్టు సమావేశం సోమవారం నిర్వహించడం జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద ఆదివారం తెలిపారు. సమావేశానికి జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి శైలజ, సీడీపీఓ అవంతి రానున్నట్లు పేర్కొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

భూపాలపల్లి రూరల్ : మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని టీపీసీసీ సభ్యుడు కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం రాత్రి పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో భూపాలపల్లి ముస్లింలకు ఆయన ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్రం నుంచి కాంగ్రెస్ పార్టీ భిన్నత్వంలో ఏకత్వం కోరుకుందని అన్ని మతాల సంక్షేమమే పార్టీ ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం పేద ముస్లిం సోదరీమణులకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకా ష్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు చల్లూరి మధు, కౌన్సిలర్ దాట్ల శ్రీని వాస్, సమ్మయ్య నాయక్, పిప్పాల రాజేందర్, అంబాల శ్రీనివాస్, కొమురయ్య, గణపురం వైస్ ఎంపీపీ అశోక్, మజీద్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న సత్యనారాయణరావు

జోరుగా గుడుంబా తయారీ

పలిమెల : నిషేధిత గుడుంబా తయారీ మండలంలో జోరుగా సాగుతోంది. ప్రభుత్వం నిత్యం గుడుంబాపై అనేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నప్పటికి గ్రామాల్లో మాత్రం గుడుంబా తయారీని నిత్యం తయారీ చేస్తూనే ఉన్నారు. గుడుంబా తయారీ చేస్తున్న వారిపై అధికారులు కేసులు పెడుతున్నప్పటికీ కేసులను లెక్కచేయకుండా తయారీకి పూనుకుంటున్నారు.

మహారాష్ట్రకు తరలింపు...

ఒకరు తయారీ చేస్తే తయారీ చేసిన గుడుంబాను స్థానికంగా విక్రయించగా మిగిలిన దానిని ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయడానికి పలువురు యువకులు బైక్‌లపై సుమారు రూ.10 వేల విలువ చేసే గుడుంబాను మహాదేవ్‌పూర్, కన్నాయిగూడెం, మహారాష్ట్రకు తరలిస్తూ ఈజీ మనీకి అలవాటు పడుతున్నారు. వ్యవసాయం, తదితర పనులు వదులుకొని గుడుంబా తయారీ, తరలింపే ప్రధానవృత్తిగా పెట్టుకున్నారు.

తూతూమంత్రంగా దాడులు...

మండలంలో సర్వాయిపేట, పలిమెల, పంకెన గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో గుడుంబా తయారీ జోరుగా జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు, పోలీసుల దాడులు తూతూ మంత్రంగానే జరుగుతున్నాయని చెప్పాలి. అధికారులు అటు వెళ్లగానే మళ్లీ గుడుంబా తయారీ మొదలు పెడుతున్నారు. అధిక డబ్బులు వస్తుండటంతో ధ్వంసం చేసిన వెంటనే నష్టాన్ని సైతం లెక్క చేయకుండా మళ్లీ మొదలు పెడుతున్నారన్నారు.



గుడుంబా తయారు చేస్తున్న దృశ్యం

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని మోడల్ స్కూల్స్‌లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కొరకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాంకుమార్ తెలిపారు. జిల్లాలో 6 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మొగుళ్లపల్లి: మండలంలోని కొర్కిశాలలోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ హైమవతి తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశానికి 100 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 55 మంది పరీక్షకు హాజరయ్యారు.7వ తరగతికి 31 మందికి 15 మంది విద్యార్థులు, 8వ తరగతికి 28 మందికి 13 మంది విద్యార్థులు, 9వ తరగతికి 15 మందికి 5 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు పేర్కొన్నారు. గురుకుల ప్రవేశపరీక్ష ఇదేరోజు నిర్వహించడంతో హాజరు శాతం తక్కువగా ఉందన్నారు.